సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం



38వ వార్డులో చెత్త ఎత్తిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ పారిశుధ్య కార్మికుల సమస్యలు అర్థం చేసుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వారి జీతాలు పెంచారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. నియోజకవర్గ పరిధి 38వ వార్డులో పేరుకుపోయిన చెత్త తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు పరిసర ప్రాంతాలను శుభ్రపరచాలని కోరారు. కార్మికులకు ఎప్పుడూ అండగా ఉంటామని, జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జేడీ శ్రీనివాసరావు, గంట్ల శ్రీనుబాబు బ్రహ్మకుమారీ ప్రతినిధులు

అల్లిపురం : మకర సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని జీవీఎంసీ అడిషినల్ కమిషనర్, జాయింట్ డైరెక్టర్ యాదగిరి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ప్రజాపిత బ్రహ్మకుమారి మెడిటేషన్ సేవా కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఓం శాంతి సంస్థ సంకల్పం చాలా గొప్పదన్నారు. అనంతరం నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆయనతో పాటు సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు సత్యవతి, మురళి, పావని, విధి విలాసం పత్రిక సంపాదకులు చింతా ప్రభాకర్ తదితరులు ఆవిష్కరించారు.

సమస్యలు పరిష్కరించాలి



శిబిరంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సీతమ్మధార : అంగన్‌వాడీల డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీ కార్మికుల దీక్షా శిబిరానికి ఆయన సంఘీభావం తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు కలిసి ఆందోళన చేస్తామన్నారు. దశాబ్దాలుగా సేవలందిస్తున్న అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జె.వి.సత్యనారాయణమూర్తి, కార్పొరేటర్ గంగారావు తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై ఘనంగా ధారోత్సవాలు

సింహాచలం : సింహగిరిపై గురువారం నుంచి ధారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాలను పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి అర్చకులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని తిరువీధిగా సింహగిరిపై ఉన్న గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అమ్మవారికి జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అక్కడే ఉన్న పురాతన మండపంలో అమ్మవారిని అధిష్టింపజేశారు. విశేష ఆరాధన, తిరుప్పావై సేవాకాలాన్ని నిర్వహించారు. పాశుర విన్నప పారాయణాన్ని విశేషంగా పఠించారు. అనంతరం అమ్మవారికి బేడా మండపంలో తిరువీధిని నిర్వంచారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు చిన్నా ఈ కార్యక్రమం నిర్వహించారు.



జగనన్న సురక్షతో ఆరోగ్య భరోసా

గతంలో వైద్యం ఖరీదైన వ్యవహారం. పేదలు రోగాల బారిన పడితే ఆరోగ్యం సమకూర్చుకోవడానికి అష్టకష్టాలు పడేవారు. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక అటువంటి బాధలకు చెల్లుచీటీ పడింది. పేదల ముంగిటకే ఖరీదైన కార్పొరేట్ స్థాయి వైద్యం తీసుకొచ్చి ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారు. సంపూర్ణ వైద్యం, ఉచితంగా మందులు అందిస్తూ పేదలచే వేనోళ్ల కీర్తింపబడుతున్నారు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి.

- వెంకటేశ్వరమెట్ట-1 సచివాలయం పరిధిలో 501 మందికి వైద్య సేవలు
- ఉచితంగా పరీక్షలు.. మందుల అందజేత
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

అల్లిపురం : ప్రజారోగ్యమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని 33,34,35,41 వార్డుల క్లస్టర్ మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం అన్నారు. కొబ్బరితోట డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. వెంకటేశ్వరమెట్ట-1 సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్లు పొందిన వారికి వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో సుమారు 501 మందిని వైద్యులు పరీక్షించారు. వారిలో పలువురిని మెరుగైన వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరానికి వచ్చే రోగుల కోసం సుమారు 200 రకాల మందులు సిద్ధంగా ఉంచారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు ఎటువంటి పోషకాహారం తీసుకోవాలో ఆశ వర్కర్లు వివరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరమెట్ట-1 సచివాలయం అడ్మిన్ భార్గవ్, కన్వీనర్ ఎల్లంకి చిన్నమ్మలు, వైఎస్సార్‌సీపీ నాయకుడు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, బొడ్డేటి ప్రసాద్, కణితి బ్రహ్మం, కొడమంచిలి శ్రీను, పిల్లి శివ, సచివాలయ కార్యదర్శులు తదితరులు సహకారం అందజేశారు.



వైఎస్సార్‌సీపీ నాయకులు నీలకంఠం, ప్రసాద్ ఆధ్వర్యంలో రోగుల పేర్లు నమోదు చేస్తున్న సిబ్బంది



మందులు అందజేస్తున్న వెంకటేశ్వరమెట్ట-1 సచివాలయం సిబ్బంది

కంటి సమస్యతో వచ్చాను



మాది వెంకటేశ్వరమెట్ట. కంటి సమస్యకు చూపించుకోవాలని వచ్చాను. డాక్టర్లు చక్కగా తనిఖీ చేశారు. మంచి సలహాలు అందజేసి, ఉచితంగా మందులు ఇచ్చారు. వైద్య శిబిరం బాగా నిర్వహించారు.

– కె. వాగ్దేవి, వెంకటేశ్వరమెట్ట

మెరుగైన వైద్యం అందించారు



జగనన్న ఆరోగ్య సురక్ష అవగాహన కార్యక్రమంలో వైద్య శిబిరానికి రమ్మని టోకెన్ ఇచ్చారు. ఇక్కడికి వచ్చాక వైద్యులు నన్ను అన్ని విధాల పరీక్షించి అవసరమైన మందులు ఇచ్చారు. మంచి కార్యక్రమం.

– జి.ఆదిలక్ష్మి

చక్కగా చూశారు



శిబిరంలో వైద్యులు చక్కగా పరీక్షలు చేశారు. అవసరమైన సూచనలిచ్చారు. శిబిరానికి వచ్చిన వారందరికీ జబ్బులకు తగ్గ మందులు ఉచితంగానే ఇస్తున్నారు. జగన్‌బాబు మంచి కార్యక్రమం చేపట్టారు.

– కోట పెంటయ్య, వెంకటేశ్వరమెట్ట

కరపత్రాల పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కొడూరు అప్పలరత్నం

మహారాణిపేట : జీవీఎంసీ 30వ వార్డు కార్పొరేటర్ కొడూరు అప్పలరత్నం ఆధ్వర్యంలో గురువారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వార్డులో గడప గడపకు పర్యటించి కరపత్రాలు అందజేశారు. తాడివీధి, మహారాణిపేట, సాలిపేట, మంధా వారి వీధి తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ అప్పలరత్నం పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి పెంటపల్లి సత్యనారాయణ, యూత్ ప్రెసిడెంట్ వడ్డాది దిలీప్‌కుమార్, వార్డు ఉపాధ్యక్షుడు దశమంతుల చిన్ని, రాము, మీనా, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



వైఎస్సార్ బీమా అందజేస్తున్న పద్మావతి తదితరులు

అల్లిపురం : జీవీఎంసీ 34వ వార్డు అచ్చియ్యమ్మపేట మసీదు వీధిలో నివసిస్తున్న బేమల కనకరాజు (ట్రాన్స్‌జెండర్) ఈ నెల 6వ తేదీన గుండెపోటుతో మృతి చెందాడు. తక్షణ సాయంగా మృతుని కుటుంబ సభ్యురాలు కుందేటి నాగలక్ష్మికి బీమా పరిహారాన్ని కార్పొరేటర్ తోట పద్మావతి గురువారం అందజేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు లింగం శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్ దూడ అప్పారావు, బి.గోవింద్, వెల్ఫేర్ సెక్రటరీ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం



34వ వార్డులో ఆర్థిక సహకారం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



వార్డుబాయ్ లైన్‌లో ఆనందరావు కుటుంబానికి ఆర్థిక సహకారం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం : గురువారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పలువురికి సొంత నిధులతో ఆర్థిక సహకారం అందజేశారు. అల్లిపురం 32వ వార్డుకి చెందిన అల్లాబోయిన రామచంద్రరావుకు, కర్ణాలవీధికి చెందిన సత్యవరపు జాన్సన్ మనోహర్‌కు, 34వ వార్డు యాతపేటకు చెందిన కర్రి నాగరాజుకు, అచ్చియ్యమ్మపేటకు చెందిన వాసుపల్లి నూకరాజుకు, రామజోగిపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తాడివలస హరి మహేశ్వరరావుకు, 30వ వార్డు కుంచమాంబ గుడి, జాలారిపేటకు చెందిన కేశం రాజేష్‌కు, 38వ వార్డు టిక్కలి డాక్టర్ స్ట్రీట్‌కు చెందిన రాగతి దుర్గకు, 38వ వార్డులోని వివేకానంద స్కూల్ ప్రాంతానికి చెందిన దూడ శ్రీనివాస్ తదితరులు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.40 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. అదే విధంగా 30వ వార్డులోని వార్డు బాయ్ కాలనీలో మృతి చెందిన ఆకుల ఆనందరావు కుటుంబాన్ని పరామర్శించారు. దహన ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే తన సొంత నిధుల నుంచి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, క్లస్టర్ ఇన్‌చార్జిలు, స్టేట్ డైరెక్టర్లు, ఆలయ చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

మానవాళికి మార్గదర్శకాలు మాస్టర్ ఈకే గ్రంథాలు



మాస్టర్ ఈకే ఆంగ్ల గ్రంథాలను ఆవిష్కరిస్తున్న స్వామి చిద్రూపానంద,సీహెచ్‌ఎస్‌ఎన్ రాజు

మహారాణిపేట : అంతర్జాతీయ ఆధ్యాత్మిక, సేవా సంస్థ జగద్గురుపీఠం ఆధ్వర్యంలో అంకోసా ఫంక్షన్ హాలులో గురువారం 63వ మాస్టర్ సీవీవీ గురుపూజా ఉత్సవాలలో మాస్టర్ ఈకే గ్రంథాలు ఆవిష్కరించారు. ఆయన రచించిన స్పిరిట్యువల్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అనే గ్రంథాన్ని కులపతి బుక్ ట్రస్ట్ చైర్మన్ సీహెచ్‌ఎస్‌ఎన్ రాజు, మాస్టర్స్ అండ్ డిసేబుల్స్ అనే పుస్తకాన్ని చిన్మయ మిషన్ నిర్వాహకులు స్వామి చిద్రూపానంద, సుపర్ణ అనే పుస్తకాన్ని జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాస్టర్ ఈకే రచనలు విజ్ఞాన భాండాగారాలు అన్నారు. ఈ సందర్భంగా జగద్గురు పీఠం జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.వి.ఎస్ మూర్తి దంపతులు చిన్నారులకు అన్నప్రాశన నిర్వహించారు. ఉదయం కామన్ ప్రేయర్, నారాయణ హోమాన్ని ధనిష్టా ఫౌండేషన్ ప్రధాన నిర్వాహకులు కంభంపాటి గురుప్రసాద్ నిర్వహించారు . సంగీత జనకులం విద్యార్థులు చేసిన బృందగానం హృద్యంగా సాగింది. మాస్టర్ ఈకేకు నీరాజనంతో మొదటి రోజు గురుపూజోత్సవాలు ముగిసాయి. సంస్థ నిర్వాహక సభ్యులు బి.ఆర్.కె. రాజు, డైరెక్టర్ అజ్జరపు శ్రీనివాస్, బి. ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నీలకంఠం, ప్రసాద్ తదితరులు

మహారాణిపేట : ఈనెల 19న విజయవాడలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఆవిష్కరణ జరగనున్న సందర్భంగా 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం ఆధ్వర్యంలో అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం సంతకాల సేకరణ నిర్వహించారు. తాడివీధి వార్డు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి కార్పొరేటర్ అప్పలరత్నం పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పెంటపల్లి సత్యనారాయణ, వార్డు యూత్ అధ్యక్షుడు వడ్డాది దిలీప్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ దశమంతుల చిన్ని, కల్యాణి, జ్యోతి, మణి, మీనా, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

33వ వార్డులో..

అల్లిపురం : విజయవాడ స్వరాజ్ మైదాన్‌లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం 19వ తేదీన ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆయనకు నివాళులు అర్పించారు. 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్, కణితి బ్రహ్మం, కొడమంచిలి శ్రీను, పిల్లి శివ, సూరిశెట్టి శ్రీను తదితరులు బోర్డు స్కూల్ వద్ద గల అంబేడ్కర్ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

నేడు ఏయూ మైదానంలో ముగ్గుల పోటీలు

ఏయూ క్యాంపస్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో శుక్రవారం ఉదయం 10 గంటల నంచి మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్టు కార్యక్రమ కన్వీనర్ చెరువు రామకోటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాతి వేడుకలలో భాగంగా జరిగే ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతిగా ముగ్గుల మహారాణి బిరుదుతో పాటు రూ.25,116 నగదు, ద్వితీయ బహుమతిగా ముగ్గుల రాణి బిరుదుతో పాటు రూ.10,116, తృతీయ బహుమతిగా ముగ్గుల యువరాణి బిరుదుతో పాటు రూ.5,116 నగదు బహుమతి అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు ఉదయం 9 గంటలకు ప్రాంగణానికి చేరుకుని తమ పూర్తి వివరాలు అందజేయాలని సూచించారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం



కుష్టు వ్యాధిగ్రస్తులను సన్మానిస్తున్న డాక్టర్ పద్మజ

మహారాణిపేట : నెహ్రూ యువ కేంద్రం, శ్రీ గాయత్రీ వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రేమ సమాజం కుష్టు వ్యాధిగ్రస్తుల నిలయంలో వివేకానంద జయంతి గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెంటెంట్ డాక్టర్ ఎ.పద్మజ ముందుగా వివేకానందునికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధిని జయించిన వారిని ఘనంగా సత్కరించారు. వారికి అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. యువత స్వామి వివేకానంద అడుగుజాడల్లో పయనించాలన్నారు. గౌరవ అతిథి నెహ్రూ యువ కేంద్రం సమన్వయ అధికారి జి. మహేశ్వరరావు ప్రసంగిస్తూ విశేష ప్రతిభ కనపరిచిన యువతకు స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ స్థాయిలో పురస్కారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ మానవసేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, బీజేపీ నాయకులు ఆల్బర్ట్, కె. సత్తిబాబు, రాంబాబు, రాజబాబు, లలిత, సుశీల, శ్రీను, చంద్రశేఖర్, అబిద్ హుస్సేన్, సింహాచలం, రామకృష్ణ తదితరులు పాల్గొనారు.

కేజీహెచ్ యూరాలజీ వార్డుకు రెండు ఏసీల వితరణ



డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీతులసీకి తాళాలు అందజేస్తున్న నిర్వాహకురాలు

మహారాణిపేట : కేజీహెచ్ సూపర్ స్పెషాలిటీ భవనంలోని యూరాలజీ వార్డుకు ఒక ప్రైవేటు నర్సింగ్ ఇనిస్టిట్యూట్ మేనేజిమెంటుకు చెందిన ప్రీతమ్ లూక్, సునీల్, డాక్టర్ సునీతారెడ్డి రెండు ఏసీలు బహూకరించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీతులసి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



ప్రత్యేక అంకరణలో కన్యకాపరమేశ్వరి



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

దాబాగార్డెన్స్ : పాతనగరంలోని కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకా పరమేశ్వరి ఆలయంలో మార్గశిర మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం అమ్మవారిని కనకమహాలక్ష్మిగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ మండపంలో ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్ శర్మచే 250 మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజలు జరిపారు. కార్యక్రమంలో దేవాలయ సంఘం అధ్యక్షుడు అరిసెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, కేవీ రమణయ్య, పూసర్ల సంజీవి, పాలూరి వరప్రసాద్, కొల్లూరు రాము, బొడ్డు రఘు, నల్లూరి నూకరాజు, పెనుగొండ కామరాజు, వర్ధనబాబు, కట్టమూరి ప్రసన్న, కుంచం సత్యవతి, సుజాత, శైలజ పాల్గొన్నారు.

'సీఐటీయూ ఉనికికే ఈ సమ్మె'



సమావేశంలో మాట్లాడుతున్న వామనరావు

దాబాగార్డెన్స్ : సీఐటీయూ (సిటు) తన ఉనికి కోసమే పారిశుధ్య కార్మికుల్ని సమ్మెలోకి దించిందని, సమ్మె కారణంగా సాధించిందేంటో తెలపాలని జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వీవీ వామనరావు పేర్కొన్నారు. యూనియన్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సమ్మె చేసిన కొన్ని కార్మిక సంఘాలు అవి సాధించలేక పోయాయని, సమ్మె వల్ల కార్మికుల్లో నిరుత్సాహం ఏర్పడిందన్నారు. తాత్కాలిక సమ్మె విరమణ అని రాష్ట్ర నేతలు చెబుతుంటే.. జిల్లాలో విజయోత్సవ సభలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికుల్ని మభ్య పెట్టేందుకే సిటు, ఏఐటీయూసీ ఉన్నాయన్నారు. తమ ప్రభుత్వం (జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం) కార్మికులు, ఉద్యోగుల పక్షాన ఉంటుందని, వారి సమస్యలు పరిష్కరించడంలో ఎల్లప్పుడూ కృషి చేస్తున్నప్పటికీ కొంత మంది కావాలనే సమ్మె పేరిట కార్మికులను విచ్ఛిన్నం చేస్తున్నారని ఆరోపించారు.

సూపర్‌స్టార్ మహేష్ అభిమానుల సందడి



మాట్లాడుతున్న కె.కె. రాజు

సీతమ్మధార : సూపర్‌స్టార్ మహేష్‌బాబు నటించిన గుంటూరు కారం చిత్రం శుక్రవారం నగరంలోని సంగం, శరత్ థియేటర్‌లో విడుదల కానున్న నేపథ్యంలో గురువారం సాయంత్రం థియేటర్ ఆవరణలో విశాఖ సిటీ వైడ్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ (డైమండ్ పార్కు) ప్రెసిడెంట్ మద్ది రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మందు గుండు కాల్చి సందడి చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. సినిమా పాటలు చూసానని, ప్రజలు మెచ్చే విధంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, థియేటర్ మేనేజర్లు సుధాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు నీలి రవి, అభిమానులు మామిడి శ్రీనివాస్, లంకా శ్రీను, జీవీఎంసీ ప్రసాద్, నున్న కృష్ణ, కాజా, నాని, నగేష్, అమర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న పురోహితులు

ఏయూ క్యాంపస్: స్థానిక పోలమాంబ ఆలయంలో గురువారం ఉదయం చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతి నెలా మంగళవారం, శుక్రవారం, పౌర్ణమి, అమావాస్య రోజుల్లో భక్తుల సమక్షంలో చండీ హోమం నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు స్వయంగా పాల్గొని తమ స్వహస్తాలతో హోమం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.గాయత్రి పర్యవేక్షించగా, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు. హోమంలో పాల్గొనదలిచే భక్తులు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని అధికారులు సూచించారు.